www.aknu.edu.in
: nannayavani@aknu.edu.in
: nannayanewstv
: Adikavi Nannaya University
: 9701293231

For Internal Circulation Only

# నన్నయ వాణి

An in-house Weekly Newsletter

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం, రాజమహేంద్రవరం - ఆంధ్రప్రదేశ్

Accredited by NAAC with 'B+' Grade, ISO 9001 : 2015 & AICTE Certified


గౌరవ సంపాదకులు
ఆచార్య కె.పద్మరాజు
ఉపకులపతి

ప్రధాన సంపాదకులు
ఆచార్య తుపాకుల అశోక్
కుల సచివులు

సంపాదకులు
డా.తలారి వాసు
సహాయాచార్య
తెలుగు శాఖ

పువ్వల ఆనంద్
ప్రజా సంబంధాల అధికారి
కోఆర్డినేటర్, మీడియా సెల్

సంపుటి : 3 | సంచిక : 36 | 05-06-2023 | పుటలు : 4


జూన్ 5

ప్రపంచ పర్యావరణ దినోత్సవం

ఆజానుబాహులారా!

ఓజోను పొరను రక్షించండి!!

- నన్నయవాణి




## ఘనంగా ఉన్నత విద్యామండలి ఫౌండేషన్ డే

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి 36వ ఫౌండేషన్ డే ను శనివారం విజయవాడలో ఘనంగా జరిగిందని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ వీసీ ఆచార్య కె.పద్మరాజు తెలిపారు. ఈ సదస్సుకు హాజరైన ఆచార్య కె.పద్మరాజు వివరాలను తెలియజేసారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ పారిశ్రామికవేత్త, సంయెంట్ ఫౌండర్ బీవీఆర్ మోహన్ రెడ్డి హాజరై ఉపన్యసించారు. ఉన్నత విద్యలో ఆధునిక మార్పులు రావాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్ర విద్యా వ్యవస్థ తీసుకొన్న విప్లవాత్మక మార్పులు భవిష్యత్ తరాల ఉన్నతికి ఎంతో దోహదపడతాయన్నారు. విద్యలోను నైపుణ్య శిక్షణ అందించాలన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నాలుగు వేల కోట్లకు పైగా నిధులు ఉన్నత విద్యకు ఖర్చు చేయడం విద్యారంగం బలోపేతానికి చిహ్నామన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆచార్య కె.హేమచంద్రరెడ్డి మాట్లాడుతూ కోర్టు కేసులను వేగంగా క్లియర్ చేస్తూ యూనివర్సిటీల్లో ఖాళీలను భర్తీ చేసేలా ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారన్నారు. ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్ ఆచార్య రామ్మోహనరావు, ఉన్నత విద్యా మండలి మాజీ చైర్మన్ ఆచార్య వేణుగోపాల్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారు ఆలూరి సాంబశివారెడ్డి, స్కిల్ డెవలప్మెంట్ ఎండీ వి.వినోద్ కుమార్, ఉన్నత విద్యామండలి కార్యదర్శి ఆచార్య నజీర్ అహ్మద్, స్పెషల్ ఆఫీసర్ సెట్స్ డాక్టర్ సుధీర్ రెడ్డి, విశాఖ ఐఐఎం డైరెక్టర్ ఆచార్య ఎం.చంద్రశేఖర్, సైంటిఫిక్ ఇనోవేషన్ అండ్ రీసెర్చ్ సీఈవో, జీఎంయు చంద్రశేఖర్, జె.ఎన్.టి.యు.కె. వీసీ ఆచార్య జి.వి.ఆర్.ప్రసాదరాజు మరియు ఆయా విశ్వవిద్యాలయాల ఉపకులపతులు, అధికారులు పాల్గొన్నారు.

## ఉపకులపతి ఉవాచ ఆకాంక్ష!



**నమస్సులు!!**

విద్యా సంవత్సరం ప్రారంభమైంది.

కలసి ప్రయాణిస్తూ భావాల్ని పంచుకుంటూ,నిత్యం నూతన పరికల్పనలతో, సృజనాత్మకతతో,నిరంతర పరిశ్రమతో విశ్వవిద్యాలయ వ్యవస్థల్ని అందరూ సమష్టిగా అభివృద్ధి దిశగా నడిపించాలని ఆకాంక్షిస్తున్నాను.

'వ్యక్తిత్వాన్ని నిర్మించి మేధాశక్తిని పెంచుతూ మానసిక బలంతో కాళ్ళ మీద మనం నిలబడగలిగేటట్లు చేసే విద్య కావాలి మనకు' అంటారు స్వామి వివేకానంద. విద్య,శిక్షణ,పరిశోధన... వీటి తుది లక్ష్యం మానవ ప్రగతి.

విద్యార్థిలో అంతకుముందే ఉన్న సంపూర్ణతను బయటికి వ్యక్తీకరించటమే విద్య అని అంటారు కాబట్టి ఆచార్యుని పాత్ర, విద్యా వ్యవస్థల పాత్ర ఈ అభివ్యక్తీకరణలో ఎదురయ్యే ఆటంకాలను అధిగమించటానికి సహాయం చేసుకుంటూ వెళ్లటం. అందువలన విద్యకు కేంద్ర బిందువు విద్యార్థి.

విద్యార్థిని సర్వాంగీణ వికాసం వైపునకు నడిపించే పనిలో అందరూ కృతకృత్యులు కావాలని ఆశిస్తున్నాను.

విద్యార్థులు సమున్నతమైన లక్ష్యాలను ఏర్పరచుకొని వాటిని సాకారం చేసుకునే దిశగా నిత్య కృషీవలురు కావాలని అభిలషిస్తున్నాను.

ఆచార్య కె. పద్మరాజు

# ప్రముఖులను కలిసిన వీసీ పద్మరాజు






సెంచూరియన్ యూనివర్సిటీ వీసీ ఆచార్య జివిఎస్ఎన్ రాజు, ఏయూ పూర్వ వీసీ ఆచార్య బీలా సత్యనారాయణ లను మర్యాదపూర్వకంగా కలిశారు. సీనియర్ ఆచార్యులుగా, వీసీలుగా ఉన్నత విద్యలో మరియు నన్నయ విశ్వవిద్యాలయ అభివృద్ధిలో వీరు చేసిన కృషిని వీసీ ఆచార్య కె పద్మరాజు ప్రశంసించారు.

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కె. పద్మరాజు ప్రముఖులను మర్యాదపూర్వకంగా కలిశారు. పార్లమెంట్ సభ్యురాలు వంగా గీత ను కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేసి విశ్వవిద్యాలయ అభివృద్ధి విషయాలను ప్రస్తావించారు. అలాగే ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ తొలి ఉపకులపతిగా సేవలందించిన ఆచార్య కె. నిరుపరాణి ని కలిసి విశ్వవిద్యాలయ ప్రగతి విషయాలను తెలియజేశారు. ఆంధ్ర విశ్వవిద్యాలయ పూర్వ ఉపకులపతి, ప్రస్తుత





## మంచిమాట



నాలుకను అదుపు చేసుకోగలిగిన విద్య తెలిస్తే అనేక విద్యలు అవలీలగా తెలుస్తాయి.

౧- విలియం క్లార్క్

# సంపాదకీయం



# పర్యావరణం

*ప్రకృతిః పంచభూతాని గ్రహా లోకాః స్వరాస్తథా!*
*దిశః కాలశ్చ సర్వేషాం సదా కుర్వంతు మంగలం!!*

ప్రకృతిలోని పంచభూతాలు, అంతరిక్షం, గ్రహాలు ఈ విశ్వమంతటికి శుభం జరగాలని మన పూర్వీకులు నిత్య ప్రార్ధనలు చేసేవారు."సర్వేజనాః సుఖినోభవంతు" అని విశ్వః శ్రేయాన్ని కోరారు.

శాస్త్ర సాంకేతిక యుగంలో వస్తున్న మార్పులే గొప్పవనుకుని ప్రకృతిని అశ్రద్ధ చేయవద్దని మహనీయులు ఘోషిస్తున్నారు. పరిశ్రమల నుంచి వెలువడే వ్యర్థాలను ప్రజా జీవనం మీదకి వదలొద్దని పచ్చని పంట పొలాలను ఉప్పు నీటి క్రయ్యలుగా మలచవద్దని పర్యావరణవేత్తలుమొత్తుకుంటున్నారు. ఎవరి ఇంటిని వారు కల్మషరహితంగా ఉంచుకోవాలని ప్రబోధిస్తున్నారు.

మన పూర్వీకులు ఈ భూమిని తల్లిగా భావించారు. నా పాదాలను నీ మీద మోపుతున్నాను. ఓ భూదేవీ! నన్ను క్షమించు తల్లీ!! అని నమస్కరించి పవిత్ర భావంతో మట్టిని స్పృశించారు.

"నిన్ను గూర్చి పాడుకుందు, నన్ను గూర్చి పాడుకొందు, నిన్ను నన్ను కన్నతల్లి నేలగూర్చి పాడుకొందు" నన్నారు సి.నా.రె. "నేలమ్మ!నేలమ్మ! నేలమ్మ! నీకు వేలవేల వందనాలమ్మా!!" అని పరవశించుకుంటూ పాడారు శ్రీ సుద్దాల అశోక్ తేజ.

ప్రకృతిలో పరవశించిన కవులు ప్రకృతికి హాని జరిగితే తట్టుకోలేరు. పరమాద్భుత తత్వాన్ని తనలో నిబిడీకృతం చేసుకున్న పుడమి మానవునికి ఆవాసమై జీవికనిచ్చింది. అందుకే ఈ భూమి మీద ఉన్న నదులు,సముద్రాలు,ఆకాశమార్గాలు, పర్వతాలు దేశాలను వేరు చేస్తున్న సరిహద్దులు కావు. సమైక్యం చేయగల మైత్రి బంధాలు. అవి విశ్వజనీనమైన మానవ జీవితానికి ఆదర్శ భావనలు. ఆ దృష్టితోనే మన పూర్వులు సకల ప్రకృతిని, ప్రపంచాన్ని ఒకే కుటుంబంగా, అఖండంగా, పవిత్రంగా, పరమాత్మ తత్వంగా దర్శించారు.

మనిషికి ప్రకృతి అనేక వరాలను ప్రసాదించింది. ప్రకృతితో సహజీవనం చేస్తున్నప్పుడు నాగరికత కలకాలం వర్ధిల్లుతుంది. కాని నాగరికత అభివృద్ధి ముసుగులో సహజ వనరుల దుర్వినియోగం పెరిగిపోతే మానవ మనుగడకే ముప్పు తప్పదు. భూమి, నీరు, గాలి, ఆకాశం వీటితో కూడిన ప్రకృతి ఏదైతే ఉందో అది భౌతిక పర్యావరణం. ఆ పర్యావరణం మరణం కాకుండా కాపాడుకోవాల్సిన బాధ్యత పూర్తిగా మనిషిదే.

ఇవాళ మనం తినే ఆహారంతో పాటు పీల్చే గాలి, త్రాగే నీరు కలుషితమైపోతున్నాయి. మన చుట్టూ ఉన్న కాలుష్యం అనేక రూపాలలో వ్యాపించి మనల్ని కబళించడానికి ప్రయత్నిస్తుంది. పంచభూతాలు కలుషితం అవడంతో ప్రకృతి తన సహజ సౌందర్యాన్ని కోల్పోయి దీనాతి దీనంగా విలపిస్తోంది.ఈ విషయాన్ని పట్టించుకోకపోతే చివరికి ఈ భూగోళం నివాసయోగ్యమే కాకుండా పోతుందేమోనని దార్శనికులు
సామాజిక శ్రేయస్సును, వ్యక్తి యొక్క మోక్షాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రకృతితో సహజీవనం చేయాలని ఒక జీవన విధానాన్ని అందించారు. దాని ఆధారంగానే వేల సంవత్సరాలుగా ఈ ప్రపంచ సమాజం జీవిస్తూ వచ్చింది.

సంయమనం,సంతృప్తి సామాజిక జీవనంలో అంతర్భాగమవ్వాలి. ప్రస్తుతం ఏర్పడుతున్న సంకట పరిస్థితిని, భౌతిక పర్యావరణాన్ని పరిరక్షించుకోవాల్సిన అవసరాన్ని, పర్యావరణాన్ని నిష్కల్మషంగా ఉంచుకుంటూ జీవించాలనే విషయాన్ని ఎవరికి వారు అవగాహన చేసుకోవలసిన సమయమిది.

పెర్మొంట్ కు చెందిన ప్రాకృతిక వాది జార్జి పెర్కిన్స్ మార్స్ ప్రకృతిని విధ్వంసం చేస్తున్న మనిషి గురించి రాస్తూ "మనిషి ఎక్కడున్నా విచ్ఛిన్నకర శక్తి.మనిషి ఎక్కడ అడుగుపెడతాడో అక్కడ ప్రకృతిలోని సమతుల్యం విపరీతంగా దెబ్బతింటుంది. భూమిపైనున్న అన్ని సంక్లిష్ట జీవుల్లోనూ మనిషి అత్యధికంగా విధ్వంసక శక్తి.ప్రకృతిని శక్తిహీనంగా చేస్తూ తాను శక్తివంతుడవుతున్నాడు" అని 'మనిషి – ప్రకృతి' గ్రంథంలో అంటారు.

ప్రకృతిని మనం రక్షిస్తే అది మనల్ని రక్షిస్తుంది. ప్రకృతిని మనం భక్షిస్తే అది మనల్ని శిక్షిస్తుంది.


# సమస్యల పరిష్కారానికి కృషి



డిగ్రీ కళాశాల విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి తక్షణం కృషి చేస్తానని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉప కులపతి ఆచార్య కె.పద్మరాజు హామీ ఇచ్చారు. సెమినార్ హాలులో నన్నయ యూనివర్సిటీ ఎఫిలియేటెడ్ కాలేజెస్ మేనేజ్మెంట్ అసోసియేషన్, డిగ్రీ, పీజీ కళాశాలల ప్రిన్సిపాల్స్ సంయుక్త సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పలు డిగ్రీ కళాశాలలకు చెందిన ప్రతినిధులు తాము ఎదుర్కొంటున్న సమస్యల్ని పద్మరాజు కు వివరించగా ఆయన సానుకూలంగా స్పందించారు.అసోసియేషన్ గౌరవాధ్యక్షులు టి.కె.విశ్వేశ్వర రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో వీసీ మాట్లాడుతూ బైపీసీ చదివిన విద్యార్థులకు కూడా బీసీఎ లో చేరేందుకు అవకాశం కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఉద్యోగాలకు ఎంపికైన వారికి సర్టిఫికెట్లు వెంటనే మంజూరు చేస్తామని చెప్పారు.డిగ్రీ విద్యార్థులకు ఆఖరి సంవత్సరం మూడు విడతల ఫీజు రీయింబర్స్మెంట్ ఈ నెల 24న విద్యా దీవెన ద్వారా విడుదలవుతుందని టి.కె.విశ్వేశ్వరరెడ్డి ప్రశ్నకు బదులిస్తూ చెప్పారు. ప్రశ్నా పత్రాలకు ఇచ్చే రుసుము సమస్యను కూడా పరిష్కరిస్తానని చెప్పారు. విద్యార్థుల పత్రాల వెరిఫికేషన్ కు రెండోసారి రుసుము వసూలు చేయకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ సందర్భంగా నూతన ఉపకులపతి పద్మరాజు ను అసోసియేషన్ సభ్యులు దుశ్శాలుతో సత్కరించారు. ఈ సమావేశంలో రిజిస్ట్రార్ టి.అశోక్, డీన్ రమేష్, అఫీలియేటెడ్ కళాశాలల అసోసియేషన్ అధ్యక్షులు కె.ఎల్.నరసింసరావు, ఉపాధ్యక్షులు నారాయణ రావు,హాబీ బుల్లా, సుగుణారెడ్డి, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# పేమెంట్ గేట్వేపై అవగాహన

హెచ్.డి.ఎఫ్.సి బ్యాంక్ అధికారులు పేమెంట్ గేట్వే కు సంబంధించిన అవగాహన కల్పించారు. విద్యార్థులు చెల్లించే ఫీజులు ఆన్లైన్ పద్ధతిలో ఎలా చెల్లించవచ్చో, దానికి సంబంధించిన ఇబ్బందులను ఎలా అధిగమించవచ్చు మరియు ట్రాన్సాక్షన్ సంబంధించిన సక్సెస్ మరియు ఫెయిల్యూర్ ఎలా ఉంటుంది అని డిజిటల్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ రిజిస్ట్రార్ పి.సురేష్ వర్మ, ఎగ్జామినేషన్స్ డీన్ డా.ఎ. మట్టారెడ్డి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఎస్.లింగారెడ్డి, ఫైనాన్స్ ఆఫీసర్ కె. శ్రీనివాస్, డా. డి. కళ్యాణి,డా. విజయ కుమారి మరియు వెబ్ మాస్టర్ మంచెం శ్రీనివాసరావు మరియు హెచ్డిఎఫ్సి బ్యాంక్ విభాగం అధికారులు పి నరేష్ – క్లస్టర్ హెడ్, జి ఉదయ్ – సొల్యూషన్స్ స్టేట్ హెడ్, జి శ్రీనివాస్ – బ్రాంచ్ మేనేజర్, ఆర్ వినీత్ – ఏరియా హెడ్ పాల్గొన్నారు.




# నన్నయలో ప్రపంచ సైకిల్ దినోత్సవం




ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో ప్రపంచ సైకిల్ దినోత్సవం సందర్భంగా సైకిల్ ర్యాలీని ఇన్చార్జ్ రిజిస్ట్రార్ ఆచార్య పి. సురేష్ వర్మ ప్రారంభించారు. అదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో సైకిల్ ర్యాలీని ఆచార్య సురేష్ వర్మ ప్రారంభించి, దాని ఉపయోగాలను తెలియ జేశారు. సైకిల్ తొక్కడం ఎంతో ఆరోగ్యమని అన్నారు. మన పూర్వీకులంతా సైకిల్ తొక్కి ప్రయాణాలు చేసేవారని, ఎంతో ఆరోగ్యంగా జీవించాలని చెప్పారు. అలాగే సైకిల్ తొక్కడం పర్యావరణానికి ఎంతో ఉపయోగకరమన్నారు. వాహనాల నుండి వెలువడే వ్యర్థ కాలుష్యాలను తగ్గించేందుకు చక్కని మార్గం అన్నారు. ఇంధన వినియోగం తగ్గించవచ్చునని, ఆర్థికంగా కూడా ఖర్చు తగ్గుతుందని చెప్పారు. ప్రిన్సిపాల్ డా.కె.సుబ్బారావు మాట్లాడుతూ చిన్నతనం నుండి సైకిల్ తోకడం ద్వారా పిల్లలకుఆర్థిక, ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయన్నారు. ఈ సైకిల్ ర్యాలి లోని విశ్వవిద్యాలయ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్స్ డా. ఎం గోపాలకృష్ణ,ముత్యాల శిరీష, డా. డి. అప్పలరాజు, డా. డి ఎస్ ఆర్ ఎస్ ప్రకాష్, డా. ఎన్ రాజశేఖర్, డా. జి. అలీస్ జాయ్, డా. ఎల్ ముత్యాల నాయుడు, డా. ఎస్ రాజ్యలక్ష్మి ఎన్ఎస్ఎస్ సిబ్బంది విద్యార్థులు అధ్యాపకులు పాల్గొన్నారు.

# వీసీ పద్మరాజుకు అభినందనలు తెల్పిన ప్రముఖులు



డా.కె.ఎ.రామరాజు. ప్రిన్సిపాల్.సర్.సి.ఆర్.రెడ్డి అటానమస్ కాలేజ్.ఏలూరు.



సుబ్రహ్మణ్యం, ఎన్ ఆర్ కన్స్ట్రక్షన్స్ కాకినాడ



శ్రీనివాసరావు, విష్ణు కాలేజ్ భీమవరం



అరుణ్, డైరెక్టర్



శివప్రసాద్, డి బెస్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఏలూరు



జి.వి.వి ప్రసాద్, చీఫ్ మేనేజర్ ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్



కె. సుందరరావు (సబ్-రిజిస్ట్రార్)




ఎమ్. సతీష్ వైస్-ప్రెసిడెంట్ (ప్రగతి ఇంజనీరింగ్ కాలేజ్ )



వి. చిరంజీవి (కెనరా బ్యాంక్ చీఫ్ -మేనేజర్ )



బుర్ర అనుబాబు (ZP-వైస్ చైర్మన్ )




# వసతిగృహాల్లో మెరుగైన వసతులు కల్పిస్తాం



**02.06.23 (మీడియాసెల్)**
ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం వసతి గృహాల్లో మెరుగైన వసతులు కల్పిస్తామని, విద్యార్థులకే అధిక ప్రాధాన్యాన్నిస్తూ ప్రణాళికలు రూపొందిస్తున్నామని వీసీ ఆచార్య కె.పద్మరాజు అన్నారు. శుక్రవారం యూనివర్సిటీ ఉమెన్స్ హాస్టల్ ను వీసీ పరిశీలించారు. హాస్టల్ విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. హాస్టల్ సమస్యలన్నింటిని పరిష్కరిస్తామని అన్నారు. విద్యార్థులు హాస్టల్ మెయింటెనెస్ కమిటీలో భాగస్వామ్యం కావాలని, భవిష్యత్ లో విద్యార్థుల మేనేజ్మెంట్ స్కిల్స్ పెరగాడానికి ఇటువంటివి ఎంతో దోహదపడతాయన్నారు. వసతిగృహాల్లోని నాణ్యమైన భోజనం పెట్టాలని వంట సిబ్బందికి సూచించారు. విద్యార్థులకు అవసరమైన అన్ని రకాల మౌలిక వసతులు కల్పించాలని అధికారులకు సూచించారు. వసతులను, వనరులను క్రమంగా ఆధునికరించే ప్రయత్నం చేస్తామన్నారు. విద్యార్థులకే తొలి ప్రాధాన్యమివ్వాలని, వారికి ఎటువంటి సమస్యలు తలెత్తకుండా వసతి గృహాల్లోని సమస్యలు వెంటనే పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్, చీఫ్ వార్డెన్ ఆచార్య డి.జ్యోతిర్మయి, వార్డెన్స్ డా.సిహెచ్.భవాని, డా.రాజ్యలక్ష్మీ మరియు హాస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.



హాస్టల్ విద్యార్థుల సమస్యలను తెలుసుకుంటున్న వీసీ పద్మరాజు

# నన్నయలో అల్లం అప్పారావు సంతాపసభ



ఆదికవి నన్నయ యూనివర్సిటీ సెమినార్ హాల్ లో శుక్రవారం ఆచార్య అల్లం అప్పారావు సంతాప సభను నిర్వహించారు. అల్లం అప్పారావు చిత్రపటానికి వీసీ ఆచార్య కె.పద్మరాజు పూలమాల వేసి నివాళులర్పించారు. విశ్వవిద్యాలయ అధికారులు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది రెండు నిమిషాలు మౌనం పాటించి ఆయన మృతికి సంతాపాన్ని తెలిపారు. ఈ సందర్భంగా, వీసీ ఆచార్య కె. పద్మరాజు మాట్లాడుతూ ఆచార్య అల్లం అప్పారావు గొప్పతనాన్ని, ఆయన ఆదర్శ భావాలను మనమందరం ఆదర్శంగా తీసుకొని విశ్వవిద్యాలయ అభివృద్ధి కోసం పాటుపడాలన్నారు. ప్రస్తుతం ఉన్న నన్నయ ప్రాంగణంలో ఆయనతో పాటు తొలిసారిగా నేను అడుగుపెట్టడం ఎంతో అదృష్టంగా భావిస్తున్నానని చెప్పారు. ఆయన అనేక మందికి పరిశోధనలలోను, పరిపాలనలోను మార్గనిర్దేశం చేసారన్నారు. యంగ్ ఉమెన్ సైంటిస్ట్ అవార్డ్ వంటివి తీసుకురావడంలో దోహదపడ్డారన్నారు. సాధ్యమైనంత వరకు ఇతరులకు సహాయం చేసేవారని, గౌరవించేవారని తెలియజేశారు. మనకు చాలా కోరికలు, హక్కులు గుర్తుంటాయికానీ బాధ్యతలు కూడా గుర్తు ఉండాలని చెబుతూ ఉండేవారని ఆయన మాటలను గుర్తు చేసుకున్నారు. మహనీయుని ఆదర్శంగా తీసుకొని విశ్వవిద్యాలయ అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని తెలిపారు. ఆయన మరణం తీరనిలోటని, వారి ఆత్మకు శాంతి చేకురాలని సంతాపాన్ని తెలియజేసారు. రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్ మాట్లాడుతూ జె.ఎన్.టి.యు.కె తొలి వీసీగా ఆచార్య అల్లం అప్పారావు పని చేసారని అన్నారు. ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఇన్చార్జ్ వీసీ గా 19.06.2011 - 19.08.2011 కాలంలో పని చేసారని అన్నారు. రెండు నెలల కాలంలో ఆయన విశ్వవిద్యాలయ అభివృద్ధికి ఎంతో కృషి చేసారని తెలిపారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ అధికారులు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

### ఆదర్శ భావాలను అనుసరించాలి

అల్లం అప్పారావు గొప్పతనాన్ని ఆయన ఆదర్శ భావాలను మనమంతా ఆదర్శంగా తీసుకొని విశ్వవిద్యాలయ అభివృద్ధి కోసం పాటుపడాలి.మనకు చాలా కోరికలు, హక్కులు గుర్తుంటాయి కానీ బాధ్యతలు కూడా గుర్తు ఉండాలని చెబుతూ ఉండేవారు. మహనీయుని ఆదర్శంగా తీసుకొని విశ్వవిద్యాలయ అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలి. ఆయన మరణం తీరని లోట, వారి ఆత్మకు శాంతి చేకురాలని సంతాపన్ని తెలియజేస్తున్నాను.

**- ఆచార్య కె. పద్మరాజు, ఉపకులపతి.**

### జె.ఎన్.టి.యు.కె తొలి వీసీ.

ఆచార్య అల్లం అప్పారావు జేఎన్టీయూ తొలి వీసీగా పని చేసారని అన్నారు. ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఇన్చార్జ్ వీసీగా 19.06.2011 - 19.08.2011 కాలంలో పని చేసారు. రెండు నెలల కాలంలో ఆయన విశ్వవిద్యాలయ అభివృద్ధికి ఎంతో కృషి చేసారు. విద్యా పరిశోధన పరిపాలన అంశాలలో ఆయన ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నాను.

**ఆచార్య టి.అశోక్, రిజిస్ట్రార్**

### అప్పారావు గారికి శిష్యులుగా ఉండటం అదృష్టంగా భావిస్తున్నాం.

నాన్ టీచింగ్ సిబ్బందిగా విశ్వవిద్యాలయంలో చేరి విశ్వవిద్యాలయ ఉన్నత అధికారిగా బాధ్యతలు చేపట్టిన అల్లం అప్పారావు గారికి శిష్యులుగా ఉండటం ఎంతో అదృష్టంగా భావిస్తున్నాం. నిరంతరం విద్యార్థుల ఉన్నతిని కోరుకొనే వారు. విశ్వవిద్యాలయాల అభివృద్ధికి ఎంతో కృషి చేసారు.

**- డా.పి.వెంకటేశ్వరరావు, ప్రిన్సిపాల్, ఇంజనీరింగ్ కాలేజ్.**

### నన్నయ అభివృద్ధిలో మైలురాయి

1996 నుండి అల్లం అప్పారావు గారితో పరిచయం ఉంది. నన్నయ విశ్వవిద్యాలయ అభివృద్ధిలో ఆచార్య అల్లం అప్పారావుగారు మైలురాయి. ప్రస్తుత నన్నయ ప్రాగణంలో తొలి నిర్మాణం ఇన్చార్జ్ వీసీగా బాధ్యతలు స్వీకరించారు. తొలిసారిగా మన ప్రాగణంలో నన్నయ విగ్రహాన్ని స్థాపించారు. విశ్వవిద్యాలయానికి ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు.

**- ఆచార్య పి.సురేష్ వర్మ, డీన్ అకడమిక్ అఫైర్స్**

### ఇంగ్లీషు తరగతులు ప్రారంభించాం

కోస్టల్ ఆంధ్రప్రదేశ్ లో ఇంజనీరింగ్ అభ్రివద్ధికి ఆచార్య అల్లం అప్పారావు చేసిన కృషి ఎంతో ఉంది. నన్నయ ఇన్చార్జ్ వీసీగా రెండు నెలలు పని చేసినా ఎంతో నిబద్ధతతో పని చేసారు. వారి కాలంలోనే ఈ ప్రాంగణంలో ఇంగ్లీషు డిపార్ట్మెంట్ తరగతులు ప్రారంభించాం.నన్ను ఎంతో ప్రోత్సహించేవారు.

**- ఆచార్య కె.శ్రీరమేష్, డీన్ సీడీసీ**

### ఒక బ్రాండ్

జె.ఎన్.టి.యు.కె. పరిపాలనలో ఆయనకు ఒక ప్రత్యేక స్థానం ఉంది. బిసిఎ కోర్సును ఆయన పరిచయం చేసారు. నన్నయ విశ్వవిద్యాలయ ప్రాంగణంలో తెలుగుశాఖ తరగతులను ప్రారంభించారు. నన్ను కుటుంబ సభ్యురాలిగా భావించేవారు.వీసీ ఆచార్య పద్మరాజుకు సహకరించండన్నారు.

**- డా.కె.కమలకుమారి, ప్రిన్సిపాల్, కాకినాడ క్యాంపస్**

### స్నేహశీలి

జియో సైన్సెస్ విభాగ అడ్మిషన్స్ పెంచడంలో ఎంతో సహకరించారు. అందరితో స్నేహపూర్వకంగా మెలిగేవారు.అందరికీ సహకారిగా ఉంటూ మంచి నాయకత్వం వహించేవారు. అందరి ఆదరాభిమానాలు సంపాదించుకున్నారు. ఆయన జ్ఞాపకాలు మన మదిలో చిరస్థాయిగా ఉంటాయి.

**- డా.కె.నూకరత్నం, యూనివర్సిటీ ఇంజనీర్**

### గొప్ప నాయకుడు

నాయకులు చాలామంది ఉంటారు కానీ గొప్ప నాయకత్వం వహించే వారు కొందరే, వారిలో అల్లం అప్పారావుగారు ప్రముఖులు. అందరితో కలిసి పనిచేసేవారు, వాటి ఫలాలను అందరికీ అందించేవారు. విద్యార్థి స్నేహితుడు, విద్యార్థుల ఉన్నతిని ఆకాంక్షించేవారు. ఆయన శిష్యులుగా ఉండటం ఎంతో ఆనందం.

**- డా.వి.పెర్సిస్, ఐ.క్యూ.ఎ.సి కోఆర్డినేటర్**

### గ్రూప్‌లో ఉండే మనిషి

ఆంధ్రవిశ్వవిద్యాలయం నుండి జె.ఎన్.టి.యు.కె, నన్నయ అనేక ప్రాంతాలలో ఆయన నాయకత్వం ప్రజలు చూశారు. ఆయన చుట్టు అభివృద్ధిని కాంక్షించే గ్రూప్ ఉండేది. విశ్వవిద్యాలయానికి నన్నయ విగ్రహాన్ని బహుకరించారు.అదే రోజున తెలుగుశాఖను ప్రారంభించటంలో వారి మాతృభాషాభమానం తెలుస్తుంది. విభాగాధిపతులకు, డీన్స్ కు ల్యాప్ టాప్ లు అందజేసి సాంకేతిక అభివృద్ధిని నన్నయలో ప్రారంభించారు.

**- ఆచార్య వై.శ్రీనివాసరావు, జియో సైన్సెస్**

### నవ్వుతూ పలకరించేవారు

విశ్వవిద్యాలయ అభివృద్ధినే తరచూ అడిగేవారు. ఎప్పుడూ నువ్వుతూ పలకరించేవారు. వేదికపై మాట్లాడినప్పుడు కూడా నవ్వుతూ మాట్లాడేవారు. పరిశోధనలు, పరిపాలన అన్ని విషయాలలో ఆయనకు ఒక ప్రత్యేక స్థానం ఉంది.

**- డా.పి.విజయనిర్మల, ప్రిన్సిపాల్, సైన్స్ కాలేజ్**

### తెలుగుశాఖ స్థాపకులు

ఇన్చార్జ్ వీసీ గా ఉన్న కాలంలోనే తెలుగుశాఖను ప్రారంభించారు. నన్నయ విశ్వవిద్యాలయం నుండి ఎందరో తెలుగు విద్యార్థులు ఆయా ప్రాంతాలలో ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలలో ఉద్యోగాలలో స్థిరపడ్డారు. సిబ్బంది సంక్షేమాన్ని కోరుకొనేవారు. పెద్ద చిన్న తారతమ్యం లేకుండా అందరిని సమానంగా చూసేవారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటున్నాం.

**- డా.కె.వి.ఎన్.డి.వరప్రసాద్, తెలుగుశాఖ కోర్సు కోఆర్డినేటర్.**

### నిబద్ధతతో పనిచేసిన మహనీయులు

సైకాలజీ విభాగం ప్రారంభించిన సంవత్సర కాలంలో నన్నయ ఇన్చార్జ్ వీసీగా వచ్చారు. కంప్యూటర్ సైన్స్ లో ఆయన అనుభవం ఎంతో గొప్పది. పరిశోధనలలో ఆరితేరిన వ్యక్తి. పరిశోధనల వైపు మార్గనిర్దేశం చేసినవారిలో అల్లం అప్పారావు గారు ముందుంటారు.

**- డా.పడాల రాజశేఖర్, సైకాలజీ అధ్యాపకులు**




అల్లం అప్పారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న వీసీ

---

# ప్రపంచ పర్యావరణ దినోత్సవం

ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని జూన్ 5వ తేదీన జరుపుకుంటున్నాము. పర్యావరణానికి అనుకూలమైన చర్యలు తీసుకోవడానికి,అందరిలో పర్యావరణం పట్ల అవగాహన పెంపొందించడానికి ఐక్యరాజ్యసమితి 1972 జూన్ 5న "ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని" జరుపుకోవాలని ప్రతిపాదించింది. దీని ప్రధాన లక్ష్యం పర్యావరణ కాలుష్యం,వాతావరణ మార్పులు, గ్రీన్ హౌస్ ఎఫెక్ట్, గ్లోబల్ వార్మింగ్ వంటి సమస్యలపై సామాన్యులకు అవగాహన కల్పించడమే. తగ్గిపోతున్న అడవులు,




పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, అకాల వర్షాలు,విష రసాయనాలు,కాలుష్య కారకాలు ఇది ఈనాటి మన భూమాత పరిస్థితి. విశాలమైన అటవీ ప్రాంతాలను అభివృద్ధి పేరుతో ధ్వంసం చేయడం, ఖనిజాల కోసం గనుల తవ్వకం,ఆనకట్టల పేరుతో లక్షలాది ఎకరాల అటవీ ప్రాంతాలను ధ్వంసం చేయడం,విషరసాయనాలతో వ్యవసాయం చేయడం వలన నేల,గాలి, నీరు, అన్ని విషపూరితమైపోతున్నాయి. ఇటువంటి పర్యావరణ వినాశకాలు ప్రపంచవ్యాప్తంగా వాతావరణ మార్పులకు దారితీస్తున్నాయి. భూతాపం,అకాల వర్షాలు, అతివృష్టి,అనావృష్టి, వరదలు,కరువులు, తుఫానులు అన్నింటికి కారణం ఈ పర్యావరణంలో వచ్చిన మార్పులే. ఈ మార్పులు అన్నింటికీ కారణం మానవుని వినాశక చర్యలే.

ఈ భూమిపై ఒకప్పుడు ఎన్నో రకాల ప్రాణులు ఉండేవి.అవన్నీ నేడు అంతరించిపోయాయి. పక్షులు చూద్దామన్నా కనిపించడం లేదు.తేనెటీగల సంఖ్య తగ్గిపోయింది.ఫలితంగా ఆహార దిగుబడి తగ్గుతోంది.దిగుబడి పెంచేందుకు రసాయనాలు, పురుగు మందులు వాడకం వలన భూమి నాశనమవుతుంది. పర్యావరణ పరిరక్షణ అంటే చెట్లు ఒక్కటే పెంచితే సరిపోదు.మనం పీల్చే గాలి, తాగే నీరు,తినే తిండి అన్ని సురక్షితంగా ఉండాలి.అందుకోసం పర్యావరణాన్ని పరిరక్షించాలి.కాలుష్యకారక పరిశ్రమలను ఆపేయాలి. సేంద్రియ పంటల సాగును ప్రోత్సహించాలి. ప్లాస్టిక్ వినియోగం తగ్గించాలి.

ఎందుకంటే మనం జీవించేందుకు ఉన్నది ఒక్కటే భూమి. భూమి నాశనం అయిపోతే మనకు జీవించేందుకు దిక్కుండదు. కనుక భూమిని కాపాడే విషయంలో ప్రభుత్వాలతో పాటు మనం కూడా చొరవ తీసుకోవాలి.భూమిపై పర్యావరణాన్ని మన ఇల్లు లాగా పరిశుభ్రంగా ఉంచుకోవాలి.పర్యావరణం చాలా అమూల్యమైనది.

అందువలన పర్యావరణాన్ని పరిరక్షించవలసిన బాధ్యత మనందరిపై ఎంతో ఉంది.

**- బి.సుశాంత్ కుమార్,**
ANUR ALUMNI.

ప్రచురణ : మీడియా సెల్, ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం-రాజమహేంద్రవరం, ఈమెయిల్ :- nannayavani@aknu.edu.in